సువర్ణముఖి నదిలో పూడిక తొలగించాలి: కలెక్టర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: సువర్ణముఖినదిలో వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద పూడిక తొలగిం చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఇక్కడ పనులు వారం రోజుల్లో ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. వరద నివారణకు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు, భూగర్భ జలాలను వృద్ధికి, సువర్ణముఖి నదిలో కొండచాకరాపల్లి వద్ద పేరుకుపోయిన ఇసుకను తొలగించాలని నీటిపారుదల శాఖ అధికారులు ఇచ్చిన నివేదికపై చర్చించారు. దీనికి సంబంధించిన అన్ని అనుమతులు తీసుకొని, వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. తొలగించిన ఇసుకను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జేసీ ఎస్.సేతు మాధవన్, భూగర్భ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్రరావు, ఆర్‌డిఓలు బి.శాంతి, ఎంవి సూర్యకళ, పొల్యూషన్ కంట్రోల్ ఇఇ సరిత, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాదరావు, మైన్స్ ఎడి విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు ఉండాలి

సెప్టెంబర్ 1 నాటికి అన్ని శాఖలు వారి ఏక్షన్ ప్లాన్ సమర్పించాలి
కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగి, ఆదాయం ఉత్పత్తి జరిగి, ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి తద్వారా జిల్లా అభివృద్ధి జరిగేలా శాఖల ఐదేళ్ళ కార్యాచరణ ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. వచ్చే ఐదేళ్ళు మీరిచ్చే ప్రణాళికల ఆధారంగానే పని చేయవలసి ఉంటుందని, అన్ని శాఖలు వారి లక్ష్యాలను, కార్యక్రమాల వారీగా సామజిక, ఆర్ధిక సూచీలను అంచనావేసి ప్రణాళికలు సమర్పించాలని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం వికసిత్ ఆంధ్ర 2047 లో భాగంగా వచ్చే ఐదేళ్ళ (2024 -29) వరకు కార్యాచరణ ప్రణాళిక పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ధిక అంశాలే కాకుండా అనేక ఆర్ధికేతర కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయని, వాటి పై ప్రజలకు అవగాహన కలిగించి ద్వితీయ సెక్టార్ లో అనేక పనులను చేయవచ్చని తెలిపారు. ఆర్ధికేతర, ఆర్ధిక పరమైన అంశాలను గుర్తించి వేర్వేరుగా ప్రణాళికలలో చేర్చాలని, ముందుగా ఆర్ధికేతర పనులను పూర్తి చేయడం ద్వారా లక్ష్యాలను పూర్తి చేయాలనీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పథకాలను నూటికి నూరు శాతం మొదట పూర్తి చేయాలనీ తెలిపారు. జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే పనులను విజన్ డాక్యుమెంట్ లో రూపొందించాలని తెలిపారు. ప్రణాళికలు వేసేటప్పుడు ముఖ్యంగా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, గడువు లోగా ఉపయుక్తమైన ప్రణాళికలు పంపాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ వాస్తవంగా చేయగలిగే పనులను మాత్రమె లక్ష్యాలలో చేర్చాలని, గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రణాళిక లో ఉండాలని తెలిపారు. ప్రతి శాఖ తన బాలలు, బలహీనతలు, వారికి ఉండే అవకాశాలను, సవాళ్ళ ను ముందుగా గుర్తించి వాటికి తగ్గట్టుగా ప్రణాళిక వేయాలన్నారు. అన్ని శాఖలలో ఉత్తమ అభ్యాసాలను గుర్తించి సాంకేతిక సహాయంతో ఆదాయ మార్గాలను పెంచేలా చూడాలని అన్నారు. మీరు వేసే లక్ష్యాలలో సహేతుకంగా ఉండాలని అన్నారు. జిల్లా ప్రణాళికా అధికారి బాలాజీ మాట్లాడుతూ లక్ష్యాల వారీగా, కార్యక్రమం వారీగా ప్రణాళిక లు తయారుచేసి సెప్టెంబర్1 లోగా పంపాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పి.డి కళ్యాణ చక్రవర్తి , ఉద్యాన సఖ డి డి జమదగ్ని, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ..

అక్టోబర్ 15న శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం

రాష్ట్ర పండుగగా అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు : ఇఓ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి, విజయనగరం ప్రజల ఆరాధ్య దేవత శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.వి.వి.ప్రసాదరావు వెల్లడించారు. సెప్టెంబర్ 20న ఉదయం 8 గంటలకు చదురుగుడి వద్ద పందిరి రాట, మండల దీక్షతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, అదేరోజు ఉదయం 11 గంటలకు వనం గుడి వద్ద ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. అక్టోబర్ 30న వనం గుడి వద్ద ఉదయం 8 గంటలకు నిర్వహించే చండీహోమం, పూర్ణాహుతి, దీక్ష విరమణతో ఉత్సవాలు ముగియ నున్నాయని పేర్కొన్నారు. తోలేళ్ల ఉత్సవం అక్టోబర్ 14వ తేదీ సోమవారం, ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన సిరిమాను ఉత్సవం అక్టోబర్ 15వ తేదీ మంగళవారం జరుగుతాయని తెలిపారు. పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల వివరాలను మంగళవారం ఆయన ఇక్కడ అన్నప్రసాద భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావుతో కలసి మీడియాకు వివరించారు. అమ్మవారి అర్ధ మండల దీక్షలు అక్టోబర్ 10 నుంచి ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. అక్టోబర్ 22న పెద్ద చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తామని, 29న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహిస్తామని చెప్పారు. అక్టోబర్ 27న కలశ జ్యోతి ఊరేగింపు వనంగుడి వద్ద నుండి జరుగుతుందని తెలిపారు. పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం 2019 లోనే గుర్తించి ప్రకటించిందని, దీనిపై జి.ఓ. నెం. 108 జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రభు త్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం జరుగుతుందని, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కూడా పట్టు వస్త్రాలు సమర్పి స్తారని చెప్పారు. అమ్మవారి జాతర ఉత్సవాల గురించి ఆలయ అనువంశిక ధర్మకర్త, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు, స్థానిక శాసన సభ్యురాలు అదితి గజపతి రాజు, కలెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్‌లకు ఇప్పటికే తెలియజేశామన్నారు. ప్రభుత్వం తరపున ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను చేయాలని కోరామని చెప్పారు. అమ్మవారి జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయనున్నట్లు ఇఓ చెప్పారు. ఉత్సవాల నిర్వహణపై త్వరలోనే కలెక్టర్ నేతృత్వంలో ఒక సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మ వారిని దర్శించు కునేందుకు లక్షలాది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నామని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు మాట్లాడుతూ దసరా ముగిసిన వెంటనే వచ్చే మంగళ వరం అమ్మవారి సిరిమాను జాతర నిర్వహించడం సంప్రదాయం గా వస్తోందని ఆ ప్రకారమే ఈ ఏడాది జాతర తేదీలను నిర్ణయిం చామని చెప్పారు. జాతర మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారని భక్తులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కాంట్రాక్టు సిబ్బందికి పెండింగ్ జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర -నెల్లిమర్ల: ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. నెల్లిమర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సిబ్బందికి బకాయి ఉన్న ఐదు నెలలు జీతం తక్షణమే చెల్లించాలని కోరారు. 2021 నుంచి రావాల్సిన పిఎఫ్ బకాయిలు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సిబ్బందికి ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలని చెప్పారు. కాంట్రాక్టు విధానం రద్దుచేసి మునిసిపల్ కార్మికుల మాదిరిగా ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. ఆసుపత్రులు, వైద్య కళాశాలలో వర్కర్ల సంఖ్య పెంచి, పని ఒత్తిడి తగ్గించాలని చెప్పారు. జీఓ నెంబరు 549, 43 ల ప్రకారం వర్కర్లకు సెక్యూరిటీ గార్డులు, సూపరు వైజర్లకు జీతాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య, ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలి

గాయత్రీ విద్యాపరిషత్ మేనేజర్ మురళీ కృష్ణమోహన్

విశాలాంధ్ర -లక్కవరపుకోట: విశాఖపట్నం జిల్లాలో మారికవలస వద్దనున్న గాయత్రి విద్యాపరిషత్, గాయత్రి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిరంతరం వైద్య ఆరోగ్య సేవలు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు మేనేజర్ పి మురళీకృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉచిత గ్రామీణ వైద్య సలహా కేంద్రాలు నిర్వహిస్తున్నామని ప్రచార కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు లక్కవరపుకోట, ఎస్ కోట మండలం బొడ్డవర గ్రామాలలో వివిధ రకముల ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులో కలవని రోగులను పరీక్షించి, గాయత్రి వైద్య కళాశాల అడ్మిషన్ అవసరమైన వైద్య సేవలు ఉచితంగా అందించబడుతుందని తెలిపారు అనుభవం గల వైద్యులచే అన్నిరకాల వైద్య సేవలు అందించడం జరుగుతుందని శస్త్ర చికిత్సలు అందించబడతాయని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు ద్వారా అర్హులైన రోగులకు 20శాతం డిస్కౌంట్ కలదని అర్హులైన వారికి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా సేవలో సభ్యులు అందించబడతాయని తెలిపారు ఈ అవకాశము ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

బొత్సకు వైసీపీ నాయకుల అభినందనలు

విశాలాంధ్ర-గుర్ల: విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ తరపున ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా వైయస్సార్ రాష్ట్ర నాయకులు బొత్స సత్యనారాయణ వైజాగ్ తన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలియజేసిన వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, కె.వి. సూర్యనారాయణ రాజు, జడ్పిటిసి చీర అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు స్వామినాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, మధుసూదన్‌రావు, మణి, బంగారు నాయుడు, అప్పలస్వామి, సూర్య, తదితరులు ఉన్నారు.

పురపాలక సంఘాన్ని సందర్శించిన పురపాలక ప్రాంతీయ సంచాలకులు జి. నాగరాజు

విశాలాంధ్ర-బొబ్బిలి : ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న డ్రైన్ల డీసిల్టే షన్ పనులను పరిశీలించారు, తాండ్ర పాపారాయ జంక్షన్ వద్ద ఉన్న కాంట్రాక్టర్ బిన్లను పురపాలక ప్రాంతీయ సంచాలకులు నాగరాజు పరిశీలించారు, మై హెూమ్ అపార్ట్మెంట్లో జరుగుతున్న ఆన్ సైట్ కంపోస్టింగ్ పరిశీలించి గృహ యజమానులకు సూచనలు జారీ చేశారు. తదుపరి రామన్న దొరవలస లో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కు ను సందర్శించి అక్కడ జరుగుతున్న ఎరువు తయారీ ప్రక్రియ గురించి క్యూబ్ బయో ఎనర్జీ ఏజెన్సీ వారి నుండి అడిగి తెలుసుకున్నారు, డాగ్ కెన్నళ్ళు సందర్శించారు, తదుపరి ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించి వారి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్ మరియు ఇతర పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ధృవ రామారావు కు 'గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్" లో స్థానం

విశాలాంధ్ర శృంగవరపుకోట : శృంగవరపుకోటకు చెందిన %ఐతీ%.ధృవ రామారావు (గొల్లు) మా మహామాయ ఇండస్ట్రీస్ లో ఇంజనీర్ గా ఉద్యోగం నిర్వహిస్తూ వాస్తు జ్యోతిశ్య శాస్త్రం లో ఎన్నో విజయాలను సాధిస్తూ దేశంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుని ఏర్పరచుకుని తనవంతు ప్రజలకై సేవ చేస్తూ వారి ఆశీర్వాద భలంచే "గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్" (పూణే), మహారాష్ట్ర వారు ఆగస్టు 15 2024 స్వాతంత్రదినం సందర్భంగా వాస్తుశాస్త్రం కి సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో 100 సంక్లిష్టమైన ప్రశ్నలకు 5 గం.లలో సమాధానములు మరియు కొన్ని సమస్యలకు తగు వివరణలు విశ్లేషణలు ఈ స్వల్ప సమయంలో ఇచ్చినందుకుగాను, వీరి అసమాన ప్రతిభను చిరస్థాయిలో నిలిపేందుకు "గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్" లో నమోదు చేసారు. ఈ నమోనా ప్రకారం "డా. ఏపీజే అబ్దుల్ కలామ్" సంస్థ నుండి "భారతీయ రత్న సమ్మాన్" పురస్కారం లభించడం ఆయనకే గాక కుటుంబసభ్యులకు స్నేహితులకు తోటి ఉద్యోగులకు శ్రేయోభిలాషులకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తూ తామందరూ అభినందనలు తెలియచేయుచున్నారు.

వాస్తవమైన ప్రణాళికలను రూపొందించాలి

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర-విజయనగరం: వ్యవసాయ శాఖ ఐదేళ్ల ప్రణాళికను వాస్తవంగా చేయగలిగే లక్ష్యాలతో రూపొందించాలని జె.సి సేతు మాధవన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత ఆంధ్ర 2047 లో భాగంగా విజన్ డాక్యుమెంట్ ను రూపొందించేటప్పుడు సాధ్యా సాధ్యాలను దృష్టి లో పెట్టుకోవాలని, రైతులకు ఉపయోగపడేలా ఉంటూ, జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. సాగు భూమి విస్తీర్ణం, పంటల దిగుబడిని పెంచాలని జేసీ తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్ నందు యాప్‌లను వినియోగించే విధానం, జిల్లాస్థాయి పంట కోత ప్రయోగాలకు చెందిన యాప్ లు, పంట నష్టం అంచనా, పంటల బీమా, సమాచార హక్కుచట్టం, తదితర కార్యక్రమాలపై వ్యవసాయ అధికారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, సి.పి.ఓ బాలాజీ, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఎపిఎంఐపీ పిడి లక్ష్మీ నారాయణ, ఏడి లు, మండల వ్యవసాయ అధికారులు, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్టేట్ సాఫ్ట్ బాల్ పోటీలో బాడంగి విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర-బాడంగి: శ్రీకాకుళంలో ఈ నెల 16,17,18 తేదీలలో జరిగిన జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో బాడంగి జడ్పీ పాఠశాల విద్యార్థిని మరడాన ప్రసన్న మన జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి స్టేట్ ప్రథమ స్థానం పొందటంలో కీలక పాత్ర పోశించిందని ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలిపారు వీరికి కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహ న్నాయుడు చేతుల మీదుగా ట్రోఫీ,గోల్డ్ మెడల్ అందుకుందని అన్నారు.ప్రసన్నకు శిక్షణ ఇచ్చిన పాఠశాల పిడి గొర్లె బంగారునాయుడు ను హెచ్ఎం సత్యన్నారాయణ, పాఠశాల సిబ్బంది,గ్రామ ప్రజలు, అధికారులు,నాయకులు అభినందించారు. ప్రసన్న క్రీడ కారి గా మరిన్ని అవార్డులు అందుకోవాలని వారంతా కోరారు రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు పేరు ప్రఖ్యాతలను తీసుకురావడంలో ఆమె చూపిన చొరవను వారంతా కొనియాడారు.

ఎమ్మెల్సీబొత్సకు మేయర్ దంపతులు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నూతనంగా ఎన్నికైన శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ ను మేయర్ విజయలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం బొత్స క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలుసుకున్న మేయర్ దంపతులు పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి, వైసిపి పార్టీ బలోపేతానికి శాసనమండలి సభ్యులు గా బొత్స నాయకత్వం మరింత ఊతమిస్తుందని మేయర్ విజయలక్ష్మి అన్నారు. బొత్స ను అభినందించిన వారిలో మేయర్ కుమారుడు దినేష్ ఉన్నారు.

వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా మిమ్స్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థిని అత్యాచార, హత్య ఘటనలో నిందితులకు కఠినంగా శిక్షించాలని మంగళవారం మిమ్స్ కళాశాల విద్యార్థులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున పట్టణంలో కొత్తపేట నీళ్ల ట్యాంక్ వద్ద నుండి మూడు లాంతర్ల వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ డాక్టర్లు అనందిత, ఎస్ రెడ్డి, యామిని మాట్లాడుతూ కోల్ కత్తా నగరంలో ఉన్న ఆర్‌జి కర్ వైద్య కళాశాలలో ఈ నెల 9న రాత్రి డ్యూటీ లో ఉన్న ట్రైనీ డాక్టర్ విద్యార్థినిపై లైంగికంగా దాడి చేసి విచక్షణ రహితంగా దాడి చేసి చంపడం అత్యంత హేయమన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే చిన్ననాటి నుండే వైద్య వృత్తిని ఎంచుకోవడం జరిగిందని, దీనికి అనుగుణంగా ఎంతో శ్రమపడి ఆశయాలు సాధించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ప్రాణాలుపోసే డాక్టర్ల ప్రాణాలు బలితీసుకోవడం అన్యాయం అన్నారు. వైద్యులే కాక అనేకమంది మహిళలు దాడులకు గురవుతున్నారన్నారు. ఘటనలో దోషులందరినీ పట్టుకొని శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సాయిలత, త్రివేద్, అరవింద్, తదితర పిజి డాక్టర్లు పాల్గొన్నారు.

జూనియర్ వైద్యురాలి హంతకులను కఠినంగా శిక్షించాలని కూటమి నాయకుల భారీ ర్యాలీ

విశాలాంధ్ర-బొబ్బిలి: కోల్‌కత్తా లోని వైద్యురాలిపై జరిగిన దారుణ అఘాయిత్యానికి నిరసన తెలుపుతూ పట్టణం లో ఎన్డీయే కూటమి నాయకులు ఆధ్వర్యంలో కోట వద్ద నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.కోల్ కత్తాలో జూనియర్ వైద్యురాలుపై జరిగిన అమానవీయఘటనను ఖండిస్తూ ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) సూచనలు మేరకు మంగళవారం నిర్వహించిన నిరసన ర్యాలీలో కాలేజ్ విద్యార్థులు రాజా కాలేజ్, వాసు కాలేజ్, లక్ష్మమ్మ మెమోరియల్ కాలేజ్, మహాత్మాగాంధీ కాలేజ్, కూటమి మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున్న పాల్గొని మహిళలకు రక్షణ కల్పించాలని అంటూ విద్యార్థులు, మహిళలు ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వరకు వెళ్లి ఆసుపత్రిలో వైద్యులతో కలిసి మౌనం పాటించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావు మాట్లాడుతూ వైద్యులపై దాడులు ఎక్కువయ్యాయని, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు అమలు చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు..ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబర్కి శరత్ , టీడీపీ సీనియర్ నాయకులు పువ్వల శ్రీనివాస రావు, జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావు, జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు పాల్గొన్నారు.

రీసర్వేతో నష్టపోయిన రైతులు

వన్ బిలు రాక కొత్త రుణాలు అందక, రిజిస్ట్రేషన్లు జరగక అవస్థలు

విశాలాంధ్ర-మెరకముడిదాం: రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు భూములపై సర్వ హక్కులు కల్పించాలన్న ఉద్దేశంతో జగనన్న భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీసర్వే కార్యక్రమంను గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పట్లో ప్రభుత్వం ఆశయం అయితే మంచిదే అయినప్పటికీ ఆశించిన స్థాయిలో జరగకపోవటం అది రైతులు పాలిట శాపంగా మారింది. మండలంలో మెట్టు భూమి సుమారు 23,598 ఎకరాలు, పల్లపు భూమి సుమారు 6968 ఎకరాలు ఉంది. గత వైసీపీ రీసర్వే కార్యక్రమంను ఆర్భాటంగా ప్రారంభించింది. అయినా ప్రభుత్వం ఆశయం నెరవేరిన దాఖలాలు లేదు. రైతులుకు ఆన్‌లైన్ లో వన్ బిలు రాక అధికారులు మెన్యువల్ గా వన్ బిలు ఇవ్వటం తో రైతులుకు రుణాలు మార్పినికే తప్ప, కొత్తగా లోన్ వాడుకోవడానికి, కొన్ని అవసరాల నిమిత్తం క్రయావిక్రియలు జరుపుకో వాలన్న వన్ బిలు తప్పనిసరి, ఆ వన్ బిలు రాక రిజిస్ట్రేషన్లు జరగక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలోకి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా రైతులు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కమిటీలు పేరుతో కొత్త ప్రభుత్వం కాలయాపన చేస్తున్నారే తప్పా రైతులు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వంలో నైనా రీసర్వే అయిన రైతులకు వన్‌బిలు ఇచ్చి న్యాయం జరుగుతుందో? లేదో? వేచిచూడాల్సిందే.

నిరుపేద కుటుంబాలకు దుస్తులు పంపిణీ

జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, మాజీ ఎంపీ చంద్రశేఖర్ సూచనల మేర వితరణ

విశాలాంధ్ర-గరివిడి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలను, వృద్ధులను, వికలాంగులను, జిల్లాలో ఉన్న గ్రామీణ, పట్టణంలో ఉన్న వైసీపి నాయకులు, కార్యకర్తలు తమ స్వంత డబ్బులు తో వారికి సహాయ సహకారాలు అందించి వారిని ఆదు కోవాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచనల మేరకు మండలంలో వెదుళ్లవలస గ్రామంలో 20 మంది నిరుపేదలకు, వృద్ధులకు ఆ గ్రామానికి చెందిన మన్నెపురి ఉమా మహేశ్వరరావు (చిట్టి) దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నాయకుడు చిన్న శ్రీను, చంద్ర శేఖర్ ఆదేశాల మేరకు గ్రామంలో పార్టీ తరపున తమ వంతు సహాయ,సహకారాలు అందిస్తానని, పేద వారికి అండగా ఉంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన సీనియర్ రిటైర్డ్ టీచర్ పెనుమత్స సాంబమూర్తి మాస్టర్ పాల్గొన్నారు.

రేపటి భారత్ బంద్ ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-రాజాం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షులు గట్టి పాపారావు కు రేపటి బందుకు స్కూల్స్ అన్నీ సహకరించాలని వినతిపత్రం అందించారు.

గంజాయి ప్యాకింగులు చేసి, ఢిల్లీకి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం మండలం ధర్మపురి పరిధిలోని వసంత విహార్ లే అవుట్ లో ఒక విల్లాను అద్దెకు తీసుకొని, గంజాయిని వేరు వేరు ప్రాంతాలకు రవాణ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వివరాలను వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మీరట్ జిల్లాకు చెందిన (ఎ-1) మహ్మద్ వసీం (34 సం.లు) అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రాంతంకు అక్కడ నుండి సుమారు సంవత్సరంన్నర క్రితం విజయనగరంకు వలస వచ్చి, శివారు ప్రాంతాల్లో ఇల్లులు అద్దెకు తీసుకొని, ఒడిస్సా మరియు ఇతర ప్రాంతాల నుండి గంజాయిని తీసుకొని వచ్చి, అద్దెకు తీసుకున్న ఇంటిలో చిన్న చిన్న పేకెట్లు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లుగా రూరల్ పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. ఈ సమాచారం మేరకు భోగాపురం సిఐ,విజయనగరం రూరల్ ఇన్చార్జ్ సిఐ జి. రామకృష్ణ ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు రైడ్ చేసి, సదరు ఇంటిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 22.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. (ఎ-2) బీహార్ రాష్ట్రం కిషాన్ గంజ్ జిల్లా అల్తవాడ గ్రామానికి చెందిన ఇన్ఫోజ్ అలం (29సం.లు) (ఎ-3) ఢిల్లీ, జామియా నగర్ కు చెందిన రుక్సాయి కుర్షీద్ (35 సం.లు) అనే మహిళ ఉన్నట్లుగా తెలిపారు. (ఎ-2) ఇన్ఫోజ్ అలం (ఎ-3) రుక్సాయి కుర్షిద్ గంజాయిని ఢిల్లీ తీసుకొని వెళ్ళేందుకుగాను విజయనగరం వచ్చినట్లుగా విచారణలో వెల్లడైందన్నారు. ఈ రైడ్లో 22,7 కిలోల గంజాయి, గంజాయిని ప్యాకింగు చేసేందుకు వినియోగించే ప్యాకింగు టేపులు, బ్రౌన్ కలర్ షీట్స్, కత్తెర, ప్యాకింగు త్రాడు, వేయింగ్ మెషిన్, ట్రాలీ బ్యాగులు, గంజాయి వాసన రాకుండా వినియోగించే కంఫర్ట్ చిక్విడ్, అగరబత్తులను సీజ్ చేసామన్నారు. (ఎ-1) మహ్మద్ వసీం ఢిల్లీకి చెందిన మహ్మద్ కబీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి, డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో గంజాయి వ్యాపారం చేసేందుకు నిర్ణయించుకొని, గంజాయిని ఒడిస్సా నుండి ఆంధ్రాకు, అక్కడ నుండి ఢిల్లీకి పథకం ప్రకారం తరలిస్తున్నారన్నారు. ఒడిస్సా మరియు ఇతర ప్రాంతాల నుండి ఎక్కువ మొత్తంలో విజయనగరం తీసుకొని వచ్చిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి, ఢిల్లీ తరలించి ఎక్కువ డబ్బులకు విక్రయించాలని నిర్ణయించారన్నారు. ఇందుకుగాను గంజాయిని అరకు ప్రాంతానికి చెందిన మజ్జి విశ్వనాధం , అతని భార్య గంగమ్మ ఒడిస్సా నుండి గంజాయిని కొనుగోలు చేసి, విజయనగరంలో ఉన్న (ఎ-1) మహ్మద్ వసీంకు కిలో రూ.3,500/-లకు విక్రయించేటట్లుగా ఒప్పందం కుదుర్చుకొన్నారన్నారు. గంజాయిని అరకు నుండి విజయనగరంకు రవాణ చేసేందుకు గోపి, అర్జున్ అనే నలుగురు వ్యక్తులు సహకరించేవారన్నారు. ఈ నలుగురు వ్యక్తులు విజయనగరంలో ఉంటున్న (ఎ-1) మహ్మద్ వసీంకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. విజయనగరంలోని (ఎ-1) వసీం వద్ద నుండి గంజాయిని ఢిల్లీ తరలించేందుకు కబీర్ వేరు వేరు వ్యక్తులను వినియోగించేవాడని, గంజాయి తరలించేందుకు గాను వారికి రూ.10వేలు రూపాయలను కబీర్ చెల్లించేవారని, వీటికి అదనంగా ట్రాన్స్పోర్టు, భోజనం ఖర్చులకు గాను మరికొంత సొమ్మును ఇచ్చేవారన్నారు. (ఎ-1) వసీంకు కిలో గంజాయికి ప్యాకింగులు చేసి, ఢిల్లీకి రవాణ చేసేందుకుగాను రూ. 1500/- లను ఢిల్లీ చెందిన కబీర్ చెల్లించేవాడన్నారు. ఈ నగదు చెల్లింపులను క్యాష్ డిపాజిట్ మెషిన్స్ (సి.డి.ఎం.)ల ద్వారా గంజాయి వ్యాపారంలో భాగస్వాములకు ముట్టజెప్పేవారన్నారు. గతంలో కూడా కబీర్, వసీంలు విజయనగరం పట్టణం బ్యాంకు కాలనీలో ఒక ఇల్లును అద్దెకు తీసుకొని, ఇదే తరహాలో గంజాయి వ్యాపారం చేసేవారన్నారు. ప్రస్తుతం ఈ కేసులో (ఎ-1) మహ్మద్ వసీం (ఎ-2) ఇన్ఫోజ్ అలం (ఎ-3) రుకాయి కుర్షిద్ ను అరెస్టు చేసామన్నారు. వీరితోపాటు ఢిల్లీ నుండి గంజాయి వ్యాపారం చేస్తున్న మహ్మద్ కబీరు, గంజాయిని సరఫరా చేసిన అరకు వ్యాలీకి చెందిన మజ్జి విశ్వనాధం, అతని భార్య మజ్జి గంగమ్మలను, ఒడిస్సా, అరకు వ్యాలీ నుండి విజయనగరంకు గంజాయిని రవాణ చేసిన గొల్లూరి అనీల్, గోవింద్, గోపి, అర్జున్ లను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులకు, ఇతర రాష్ట్రాల వ్యక్తులకు తమ ఇల్లులను అద్దెకు ఇచ్చే ముందు వారి పూర్వాపరాలు ముందుగా తెలుసుకోవాలని, వారు ఇంటిని ఎందుకు వినియోగిస్తున్నది పూర్తిగా తెలుసుకున్న తరువాతనే ఇల్లులను అద్దెకు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సిఐజి. రామకృష్ణ, ఎస్బి సిఐ కే.కే.వి. విజయనాథ్, రూరల్ ఎస్ఐలు ఆర్. వాసుదేవ్, శ్యామల ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిషాప్ లో సీసీ కెమెరాలు ఖచ్చితంగా ఉండాలి : సిఐ నారాయణమూర్తి

విశాలాంధ్ర-ఎస్.కోట: శృంగవరపుకోట వర్తక సంఘం ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వివిఎం మూర్తి, సబ్ ఇన్స్పెక్టర్ గంగరాజుతో కలిసి ఎస్కోటలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంలో వర్తకసంఘం సహాయ సహకారాలు అందించాలని కోరడమైనది షాపుల వద్ద లోడింగ్ అన్లోడింగ్ చేయు వాహనాలకు బిజీ టైం లో కాకుండా పబ్లిక్ తక్కువ ఉండే టైం లో దించుకోవాలని, సమయాన్ని నిర్దేశించడం జరిగినది. రోడ్డు మీద షాపులు ఆక్రమించినట్లయితే... తొలగించి కేసులు నమోదు చేస్తామని..షాపులు వద్ద ఉన్నటువంటి సీసీ కెమెరాలు రోడ్ వైపు బయటికి కనబడే విధంగా లెఫ్ట్, రైట్ పూర్తిగా కవర్ అయ్యే విధంగా అమర్చుకోవాలని ఆదేశించారు. ..

ఉచితనేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

63 మంది రోగులకు చికిత్స

విశాలాంధ్ర- మెరక ముడిదాం: మెరకముడిదాం మండలం గాదెల మర్రివలస సచివాలయం లో మంగళవారం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక టిడిపి నాయకులు చల్లా శ్రీరామ్ మరియు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత నేత్ర వైద్యశిభిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరానికి 63మంది రోగులు హాజరు కాగా వీరిలో 24 మందికి కంటి ఆపరేషన్ చేసేందుకు గుర్తించారు. వీరందరిని విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించటం జరుగుతుంది. రోగులుకు పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు సురేష్ వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవీయస్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు బివి గోవిందరాజులు, గ్రామ సర్పంచ్ అట్టాడ దేవదాసు, గ్రామ పెద్దలు చల్ల చిన్నప్పలనాయుడు, రామచంద్రుడు, అప్పలనా యుడు, ఈశ్వరరావు, కృష్ణ, శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మండల కేంద్రంలోని సుబ్బి రామిరెడ్డి కళ్యాణ మండపంలో ఎస్ కోట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గేదెల తిరుపతిరావు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ పారదర్శకత మరియు నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమాలి శెట్టి నానాజీ, చింతల ఈశ్వరరావు మట్టా వీరభద్రరావు, సీతమ్ నాయుడు, వెలుచూరు గోపి మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం

విశాలాంధ్ర -మెరకముడిదాం: మండలంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం తేదీ 20-08-2024 నుండి 18-9-2024 వరకు జరుగుతుంది. తేదీ 20-08- 2024న గర్భం, నర్సాయిపేట, చిన్న మంత్రి పేట, పెద్ద మంత్రి పేట, లంకపేట, బొడంతర వలస గ్రామాల్లో 600 పశువులకు టీకాలు వేయడం జరిగింది. గాలికుంటు వ్యాధి వలన పాల ఉత్పత్తి మరియు పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుంది. రైతులకు తీవ్రమైన ఆర్థిక నష్టం జరుగును. పాలు తాగే దూడల్లో మరణాలు సంభవించును. వీటన్నిటిని నివారించాలంటే టీకా ఒకటే మార్గం. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.హైమావతి సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ల నిర్వహణకు దాతలు విరాళాలు ఇవ్వవచ్చు

నగరపాలక కమిషనర్ నాయుడు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ల నిర్వహణకు దాతలు విరాళాలు ఇవ్వవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్ పరిసరాలను ఆయన పరిశీలించారు. అలాగే పేదలకు అందుతున్న అల్పాహారం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. అల్పాహారాన్ని తీసుకుంటున్న పేదలు ఎంతో రుచికరంగా ఉందని తెలియజేయడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నాకేంటిన్ల పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. అలాగే అన్నా క్యాంటీన్ల నిర్వహణకు దాతలు ముందుకు రావాలని కోరారు. నేరుగా గాని, చెక్కుల రూపంలో గానీ విరాళాలను అందివ్వవచ్చునని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంట్ ను కూడా తెరవడం జరిగిందన్నారు. ప్రజలు తమ శుభకార్యాలు, వివాహ వార్షికోత్సవాలు, పూర్వీకుల వర్ధంతి, జయంతి సందర్భంగా అన్నదానం చేయగోరు వారు విరాళాలు అందుకు వచ్చునని తెలిపారు.

పర్యావరణ సమతుల్యానికి మొక్కలు దోహదం

విశాలాంధ్ర- విజయ నగరం టౌన్ : పర్యావరణ సమతుల్యానికి మొక్క లు దోహదపడతాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయు డు తెలిపారు. మంగళవారం మేరే లైఫ్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మే కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని అన్నారు. వాటిని సంరక్షించే బాధ్యతను కూడా చేపట్టాలని అన్నారు. ప్రస్తుతం విపరీతంగా పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు మొక్కలు విరివిగా నాటాలని అన్నారు. మొక్కల ఆవశ్యకతగా గూర్చి చిన్నతనం నుండి పిల్లల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ తెలియజేయండి : పట్టణ సీఐ

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం అలజంగి గ్రామం పాల్తేరు గ్రామాల మధ్య కల్వర్టు వద్ద గుర్తుతెలియని మగ శవం కల వర్టులో పడి ఉందని అలజంగి సచివాలయం-2 వీఆర్వో పెది రెడ్ల వెంకీ నాయుడు ఇచ్చిన రిపోర్ట్ మేరకు పట్టణ సీఐ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ లోవరాజు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించి, కానిస్టేబుల్ చలపతి మరియు హెూంగార్డ్ సాయి సహాయంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విలేకరులకు తెలిపారు. మృత దేహాన్ని తరలించడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో సుమారు ఒక కిలోమీటర్ దూరం కానిస్టేబుల్ చలపతి శవాన్ని తన భుజంపై వేసుకొని వాహనం వరకు మోసుకు వెళ్లి మానవత్వం చాటుకున్నారు. మానవత్వం చాటుకున్నా చలపతి రావు ను పలువురు అభినందించారు.

పిఏసిఎస్లను బలోపేతం చేయండి

రైతులందరినీ సంఘాల్లో సభ్యులుగా చేర్చాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయడానికి, వచ్చే మూడు నెలల్లో క్రమబద్ధీకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్లో మంగళవారం జరిగింది. జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, సహకార సంఘాల కార్యకలాపాలను పెంచాలని, బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని మొత్తం 65 సహకార సంఘాల్లో కేవలం 9 మాత్రమే లాభాల్లో ఉన్నాయని, మిగిలిన వాటిని కూడా లాభాలబాటలో నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ముందుగా ఈ సంఘాలను మూడు నెలల్లో క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. సంఘాలు నష్టాల్లో ఎందుకు ఉన్నాయో అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలోని 65 సంఘాల్లో సుమారు 2,60,000 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, జిల్లాలోని మొత్తం రైతులందరినీ సభ్యులుగా చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకో 30 వేల మంది రైతులనైనా సభ్యులుగా చేర్చాలన్నారు. కంప్యూటరీకరణను వేగంగా పూర్తి చేయాలన్నారు. అలాగే సంఘాల ద్వారా ఇచ్చే రుణాలను, వసూళ్లను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, జిల్లా సహకార అధికారి రమేష్, సిపిఓ పి.బాలాజీ, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, డిపిఓ శ్రీధర్ రాజా, ఫిషరీస్ డిడి నిర్మలాకుమారి, మార్కెటింగ్ ఏడి రవికిరణ్, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డులుగా కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డు విభాగంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ఇద్దరు హెూంగార్డ్స్ కుటుంబాలకు కారుణ్య నియామకాల్లో భాగంగా వారి సతీమణులను హెూంగార్డ్సుగా నియమిస్తూ, ఉత్తర్వుల ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - విధి నిర్వహణలో మృతి చెందిన హెూంగార్డు కుటుంబాలను ఆదుకొనుటలో భాగంగా వారి కుటుంబంలోని ఇద్దరు మహిళలను పోలీసుశాఖలో హెూంగార్డుగా నియమిస్తూ త్వరితగతిన ఉత్తర్వులు జారీ చేసామన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా విధి నిర్వహణలో ఇటీవల కరెంటు షాక్కు గురై మృతి చెందిన హెూంగార్డు జి. వెంకట సత్యం సతీమణి జి.పార్వతికి, అదే విధంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెూంగార్డు ఎస్. చిన్నోడు సతీమణి ఎం.రజినీ లను జిల్లా పోలీసుశాఖ నందు హెూంగార్డులుగా నియమించి, నియామక ఉత్తర్వులను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందజేసారు. అలాగే ఇటీవల కరెంటు షాక్కు గురై మరణించిన హెూంగార్డు జి.వెంకట సత్యం కుటుంబానికి విజయనగరం జిల్లా హెూంగార్డు విభాగం నుండి వివిధ విభాగాల్లో డిప్యూటేషనుపై పని చేస్తున్న హెూంగార్డులు సమకూర్చిన ఒక్క రోజు అలవెన్సు రూ.23,430/-లను 'చేయూత' గా మృతి చెందిన హెూంగార్డు జి.వెంకట సత్యం సతీమణి జి.పార్వతికి అందజేసారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలను సకాలంలో అందే విధంగా చర్యలు చేపడతామని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, రిజర్వు ఇన్స్పెక్టరు ఆర్.రమేష్ కుమార్, డిపిఒ పర్యవేక్షకులు ప్రభాకరరావు, ఆర్ఎస్ఐ షేక్ ఆలీ, ఇతర పోలీసు అధికారులు, హెూంగార్డ్సు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల ఆమోదం కోసం గ్రామ సభలు

ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలి

జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: ఉపాధి హామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామం లో ఈ నెల 23 న గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ గ్రామ సభల్లో సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయం చేసుకొని ప్రణాళికా బద్ధంగా గ్రామ సభలను విజయవంతం చేయాలన్నారు. మంగళ వారం కలెక్టర్ ఎం.పి.డి.ఓ లు, ఈ ఓ ఆర్ డి ల తో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభల పై పలు సూచనలు చేశారు. గ్రామ సభల్లో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా మండల అభివృద్ధి అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. రెండు రోజుల ముందే గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం గావించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు వీలున్నంత ఎక్కువ గ్రామాల్లో గ్రామ సభలకు హాజరు కావాలని సూచించారు. డ్వాక్రా మహిళల ద్వారా ఎక్కువ ప్రచారం గావించి గ్రామ సభలకు మహిళలు ఎక్కువగా హాజరయ్యేలా చూడాలని డి.ఆర్.డి.ఏ పి.డి కల్యాణ చక్రవర్తి కి తెలిపారు. గ్రామ సభల కార్యక్రమాలన్నీ వీడియోగ్రఫీ చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా, సభలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అంతకు ముందు డ్వామా పి.డి అరుణ శ్రీ మాట్లాడుతూ గ్రామ సభల్లో ఉపాధి హామీ చట్టం గురించి వివరించాలని, ప్రస్తుతం జరుగుతున్న పనులను, భవిష్యతు లో చేపట్టబోయే పనులను కూడా తెలియజేయాలని తెలిపారు. వ్యవసాయ అనుబంధంగా జరిగే పనులకు, ఉద్యాన వనాల కు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. డి.పి.ఓ శ్రీధర్ రాజా మాట్లాడుతూ 21 న ప్రతి మండలం లో మాక్ గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొనేలా సర్కులర్ ఇవ్వడం జరిగిందని గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ అధికారి నిర్మలా దేవి తెలిపారు. గ్రామ స్థాయి వ్యవసాయ అధికారులు కూడా పాల్గొంటారని జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు తెలిపారు.

ట్రైనీ డాక్టర్ మృతి పై జనసేన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

విశాలాంధ్ర.రాజాం: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాజాం లో మంగళవారం జనసేన రాష్ట్ర నాయకులు పొగిరి సురేష్ బాబు (రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి) ఆధ్వర్యంలో బొబ్బిలి జంక్షన్ నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ జంక్షన్లో మానవహారం నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా లో ఆర్ జి ఆర్ మెడికల్ కాలేజీలో ప్రాక్టీస్ చేస్తున్న యువ వైద్యరాలపై అత్యంత దుర్మార్గమైన అత్యాచారం అనంతరం హత్య చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని వైద్య సిబ్బందికి రక్షణ వలయంగా చట్టాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం తేవాలని కోరుతూ నిరసన కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా పొగిరి సురేష్ బాబు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో కలకత్తాలో ఆగస్టు 9వ తేదీన మెడికల్ కాలేజీలో జరిగిన వైద్యరాలు హత్య కు నిరసనగా ఈరోజు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రజలు మేధావులు,లాయర్లు, డాక్టర్స్ వైద్య సిబ్బందితోపాటు ప్రజాసంఘాల నాయకులు వివిధ కార్మిక సంఘాలు మహిళా సంఘాలు నిరసనలు అగ్ర హవేశాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో వైద్యరాలు చనిపోయి నేటికీ 11 రోజులు అయినప్పటికీ అత్యాచారం చేసి హత్య చేసి చంపేసిన వ్యక్తులను గుర్తించి శిక్షించడంలో అక్కడున్న రాష్ట్ర ప్రభుత్వము గాని పోలీస్ సిబ్బంది గాని పూర్తిగా నీరు కారిచే పరిస్థితి కనిపిస్తుందని ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో మంది ప్రాణాలు కాపాడే వైద్యులకే ఈరోజు ఇలా జరిగితే సామాన్య ప్రజలకి ఇంకా భవిష్యత్తులో ఏమి రక్షణ ఉంటుందని కాబట్టి వెంటనే ఎంతో క్రమశిక్షణతో ఉన్న మెడికల్ కాలేజీలో ఈరోజు యువ వైద్యరాలపై అత్యాచారం అనంతరం హత్య చేసిన నిందితులకు కఠినంగా శిక్ష పడే విధంగా ఆయారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చూడాలని అలాగే ఈ విషయంలో రాజకీయం నాయకులు ఎంతటి వారు ఉన్న మెడికల్ మాఫియా కూడా ఎవరు ఉన్నా వారిని వదిలేయకుండా వెంటనే వారికి అరెస్ట్ చేయాలని అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య సిబ్బంది కి రక్షణ కొరకు భవిష్యత్తులో ఇలా జరగకుండా ప్రత్యేక చట్టాన్ని తేవాలని ప్రపంచవ్యాప్తంగా ఇంకా ఈ పోరాటం ను ఉధృతం కాకముందే ఎవరైతే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి వైద్య సిబ్బందికి రక్షణ కల్పించే విధంగా చట్టాలు తేవాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నాం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఈరోజు యువ వైద్యరాలు చనిపోయిన ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడ్వకేట్ కుప్పిలి శ్రీనివాసరావు గార శివరాం, ఎల్.అన్నమ నాయుడు, గొర్ల గోవిందరావు, మీసాల రాంబాబు, కూటికుప్పల రాజారావు, కె.వి. ప్రవీణ్ కుమార్, కెల్ల సూర్యనారాయణ, డబ్బాడ కృష్ణ, బలస శ్యాంసుందర్, మామిడి రవికుమార్, వంజరాపు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయోద్యమ రూపశిల్పి పాతూరి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేసేం దుకు విశేష కృషి చేసిన పాతూరి నాగ భూషణం గ్రంథాలయోద్యమ రూపశిల్పి అని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఎన్సిసి,ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్. కె. డిగ్రీ కాలేజీలో నిర్వహించిన పాతూరి జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాతూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయనను స్వాతంత్ర సమరయోధునిగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం తామ్ర పత్రం బహూకరించిందని అన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్ సొంతం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ రఘువర్మ, కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. అప్పలనాయుడు లను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె. దయానంద్, ప్రధాన కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, పి ఓ లు వర్రి సన్యాసినాయుడు, కె. సరస్వతి లు పాల్గొన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయంలో ఫోటోగ్రఫీపై వర్క్ షాప్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ అంతర్జాతీయ యాత్రికుడు, రచయిత, ఫోటోగ్రాఫర్ బీరా అశోక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫోటోగ్రఫీ మాధ్యమం సాంకేతికతకు మించి ఒక కథను చెప్పే శక్తిగా ఎలా రూపుదిద్దుకుంటుందో వివరించారు. "ప్రతి ఫోటో ఒక కథ, ఒక సందర్భం, ఒక సంస్కృతిని పట్టుకోవడానికి కళ్ల ద్వారా ప్రపంచాన్ని చూసే అద్భుత సాధనం" అన్నారు. ఫోటోగ్రఫీ మానవ అనుభవాలను క్యాప్చర్ చేయడంలో ఒక సృజనాత్మక ప్రక్రియగా ఎంత ప్రాముఖ్యత ఉన్నదని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఫోటోగ్రఫీ పై హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్ ఇచ్చారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్, జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు మాట్లాడుతూ, ఫోటోగ్రఫీని కేవలం సాంకేతిక పరిజ్ఞానంగా కాకుండా ఒక కళాత్మక ప్రక్రియగా చూడాలన్నారు. ఫోటోల్లో యదార్థాన్ని ప్రతిబింబించే ప్రయత్నం చేయాలని, ప్రేక్షకుల మనసుకు హత్తుకునే ఫోటోలు తీయాలని సూచించారు. ఫోటోగ్రఫీ విద్యలో ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఫూల్ బాగ్ రహదారిలో గుంతల పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బొబ్బిలి: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం కొరకు ఆందోళన కార్యక్రమంలో స్థానికంగా గాయత్రి, విద్వాన్, సత్యసాయి, సాయిరాం ఒకేషనల్, టీ.పి కాలేజీల విద్యార్థులు వచ్చి వెళ్లే రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి దాని కారణంగా విద్యార్థులు కాలేజీకి రాలేకపోతున్నారని . అదేవిధంగా ప్రజలు కూడా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు కిరణ్, మణికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రజలు వెళ్లే రహదారి అయిన ఫూల్బాగ్ రోడ్డుపై గుంతల కారణంగా విద్యార్థులు కాలేజీకి రాలేక ప్రజలు వెళ్లే ఆటోలో బోల్తా పడి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు దీన్నే అధికార పార్టీ పట్టించుకోని పరిస్థితి ఈ విధంగా ఉండటం సిగ్గుచేటుని అన్నారు . విద్యార్థులు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు ఆ మార్గంలో ఉన్న రోడ్డును పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు వచ్చి వారం రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.వారం రోజుల్లో పూర్తి కాకపోతే విద్యార్థులను ప్రజలను ఏకం చేసి తీవ్ర ఆందోళన చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కె, శివ మండల నాయకులు చరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ సమస్యలు సృష్టిస్తే ఊరుకునేది లేదు

విశాలాంధ్ర-వంగర: గ్రామాల్లో లేనిపోని సమస్యలు రాజకీయంగా సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎం ఎల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం ఎంపీపీ సురేష్ ముఖర్జీ అధ్యక్ష తన జరిగిన మండల సర్వ సభ్యసమావేశం లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిభందలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మి ఢ్దేమీల్,ఫీల్డ్ అసిస్టెంట్లు,డీలర్లు,అంగన్వాడీ తదితరులు పై ఎటువంటి చర్యలు తీసు కొన్నా సమస్య ఉండదని, రాజకీయంగా,ఇటువంటి వారిపై చర్యలకుపక్రమిస్తే మండలం లో అందరం కలసి పోరాడు తామని అధికారి పార్టీ వారికి హెచ్చరించారు.మండలంలో మండల పరిషత్,గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం మరో రెండేళ్లు ఉందని,ఈ వంగర మండలంనకు సంబంధించి 12 మంది ఎంపీటీసీలు, 29 గ్రామ పంచాయతీలలోఒక్క మూడు గ్రామ పంచాయతీలు తప్ప 26 గ్రామాల సర్పంచ్ లు తమ సానుభూతి పరులే నని ఆయన వివరించారు. ఏ కారణం లేకుండా నిభందనలు విరుద్ధంగాచేస్తే అంతా సమిష్టిగా ఉండి పోరాడుతామన్నారు. కార్యాలయంలో కూర్చొని ఎవరినీతొలగించవద్దని,నిభందనలు ప్రకారం చేయా లనీ, అధికారానికి లొంగిఎవర్నీ తొలగించ వద్దనివెలుగు ఏపిఎంనుద్దేశించి అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎవరికీ ఇబ్బంది పెట్టలేదని, విక్రాంత్,ఎంపీపీ సురేష్ ముఖర్జీ అన్నారు. ఈ నెల 23న మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామ సభలు సమావేశాలు నిర్వహించనున్నట్లు ఏపిఓ సత్యవతి సభకి వివరించారు.

ఎస్ కోట ఆర్టీసీ డిపోను పరిశీలించిన జోన్ డైరెక్టర్ రవికుమార్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట ఏపీఎస్ఆర్టీసీ డిపోను జోన్ 1 డైరెక్టర్ రవికుమార్ సందర్శించారు ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తవలసలో సిబ్బంది కొరకు 24 మంది కి సరిపోయేటట్లు 12 కొత్త మంచాలను కొత్త పరుపులతోను విశ్రాంతి గదిని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రారంభించారు మరియు ఎస్ కోట డిపోలో సిబ్బందిని కలిసి వారికి సూచనలు సలహాలను అందించారు ఆర్టీసీ డిపో ఆవరణలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తము మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి సిహెచ్ అప్పలనారాయణ మరియు డిపో మేనేజర్ రమేష్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆర్ ఎస్ డి ఐ వేణు సూపరిండెంట్ కృష్ణారావు ,సన్నీ బాబు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్స్ రెండో విడత రిజిస్ట్రేషన్

22 తేదీ నుంచి ప్రారంభం : ప్రిన్సిపల్ డా. కేశవరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగారపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఈనెల 22 నుంచి ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 24వ తేదీన ముగుస్తుందని తెలిపారు. తమ కళాశాలలో బిఏ పొలిటికల్ సైన్స్ మరియు ఎకనామిక్స్, బీకాం జనరల్ మరియు బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కెమిస్ట్రీ మరియు బిఎస్సి మ్యాథమెటిక్స్ కోర్సులు కళాశాలలో అందిస్తున్నామని తెలిపారు, మా కళాశాలలో ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ మరియు డిజిటల్ క్లాస్ రూమ్ లు, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ ల్యాబ్స్ మరియు డిజిటల్ లైబ్రరీ ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా ఉందని తెలిపారు, కావున విద్యార్థిని విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోపల తమ యొక్క రిజిస్ట్రేషన్ ఓఏఎండీసీ వెబ్సైట్ నందు చేసుకోవాలని తెలిపారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు మా కళాశాల అన్నివిధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేశారు.

పాడిపశువులకు గర్భకోసవ్యాధులకు ఉచిత చికిత్స

కొత్తవలస సబ్ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఏడి గంగాధర్

విశాలాంధ్ర-లక్కవరపుకోట:మండలంలోని గేదెలవానిపాలెం గ్రామంలో ఉచిత గర్భకోస వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించడం జరిగిందని కొత్తవలస సబ్ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఏడి గంగాధర్ తెలిపారు తెలిపారు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరంలో 43 మంది పాడి రైతులకు సంబంధించిన 72 పశువులకు గర్భకోస వ్యాధులకు 12 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమము పాశుగణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ గోకుల్ మిషన్ కింద నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు కోరాడ గాయత్రి, సత్యనారాయణ, జగదీష్, వర్షం భర్తకు సహాయకులు గోపాల మిత్రులు పాల్గొన్నారు.

నూతన ఎండిఓ శేషుబాబు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్ కోట మండల అభివృద్ధి అధికారిగా శేషుబాబు బాధ్యతలు వారి కార్యాలయం అయినా మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి వారి కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారులు మరియు మండలంలో ఉన్న అన్ని గ్రామ కార్యనిర్వహణ అధికారుల సమక్షంలో వారు బాధ్యతలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఇక్కడ పనిచేసి వెళ్తున్నటువంటి సాంబశివరావు కు ఎంపీడీవో సిబ్బంది ఘనవీడ్కోలు పలికారు శేషుబాబు కు గతంలో ఎస్ కోట లో పనిచేసినటువంటి అనుభవం ఉంది

ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో రాజీవ్ గాంధీ జయంతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్కోట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని జాతీయ సద్భావన దివాస్ ను పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ జాతీయ సద్భావన వార్డు అనేది మతసామరస్యం జాతీయ సమైక్యతను మరియు శాంతిని పెంపొందించడంలో విశేష కృషి చేశారని తెలియజేశారు మరియు గ్రామీణ ప్రాంతాలలో టెలిఫోన్లు ఏర్పాటు చేయడంలో ఎనలేని కృషి చేసి పబ్లిక్ కాల్ ని కూడా సృష్టించారు అని తెలియజేశారు మరియు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మరియు కామర్స్ అధ్యాపకులు డాక్టర్ జి ఈరన్న మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 1986లో జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించాలని మరియు1986లో జోహార్ నవోదయ విద్యాలయ వ్యవస్థ అనే కేంద్ర ప్రభుత్వ ఆధారిత సంస్థ స్థాపించారని తద్వారా సమాజంలోని గ్రామీణ వర్గాల అభ్యున్నతి కోసం వారికి ఆరు నుండి 12వ తరగతి వరకు ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందిస్తున్నారని కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే వాసుదేవరావు ఐపిఎస్సి కోఆర్డినేటర్ డాక్టర్ వి సుధీర్ అధ్యాపకులు ఎస్ వలి ఖాన్ కే అప్పలరాజు డి హైమావతి డి రామకృష్ణ లక్ష్మణ్ ఈరన్న మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ నూకలమ్మ అమ్మవారి ఆలయంలో పూజ కార్యక్రమలు

విశాలాంధ్ర -విజయనగరం రూరల్ : అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామి నాయుడు పిలుపు మేరకు పట్టణం లో మెగా సోల్జర్స్, చిరంజీవి యువత ఆద్వర్యం లో జరుగుతున్న పద్మవిభూషణ్ మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా 2వ రోజు మంగళ విధి లో ఉన్న శ్రీ నూకలమ్మ అమ్మవారి ఆలయం నందు పూజ కార్యక్రమలు చేయడం జగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ జిల్లా నాయకులు గురాన అయ్యలు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా స్టార్ చిరంజీవి ఇటు వంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్ లో మరిన్ని విజయవంతమైన చిత్రలో నట్టించి అభిమానులను అలరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మెగా సోల్జర్స్,చిరంజీవి యువత ప్రతినిధులుఎంటి రాజేష్, మేడేపల్లి పవన్ కుమార్,సంతోష్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.